సాక్షి పల్నాడు

శనివారం । 5 । జూలై । 2025



కనక దుర్గమ్మకు బోనాలు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల భవానీనగర్‌లో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని బోనాల మహోత్సవం వైభవంగా నిర్వహించారు.



అమ్మవారికి సారె సమర్పణ

నరసరావుపేట ఈస్ట్: ఆషాఢ మాసం సందర్భంగా పాతూరు భీమలింగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారికి శుక్రవారం మహిళలు సారె సమర్పించారు.

శాకంబరీగా వాసవీమాత



అచ్చంపేట: ఆషాఢ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా అచ్చంపేటలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిని శాకంబరీగా అలంకరించారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు.

అన్నదాత పక్షాన నిరసన గళం

- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో నినదించిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీ సభ్యులు
- గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్న రైతులు
- కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి
- వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



సమావేశం వేదికపై ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, కలెక్టర్లు నాగలక్ష్మి, అరుణ్‌బాబు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్ : అన్నదాతల ఆక్రందనలపై వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీ సభ్యులు జెడ్పీ సర్వసభ్య సమావేశం వేదికగా గళం విన్పించారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక, కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మిన వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. తొలుత అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ కల్తీ విత్తనాలు విక్రయించిన వ్యాపారుల నుంచి రైతులకు నష్ట పరిహారాన్ని అందించడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని డిమాండ్ చేశారు. మిర్చి, పొగాకుకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టాలు చూస్తున్న సంఘటనలపై ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, ధూళిపాళ్ల నరేంద్ర, నక్కా ఆనంద్‌బాబు, బాష్యం ప్రవీణ్, జీడీసీఎంఎస్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరి బాబు, బాపట్ల డీఆర్వో గంగాధర్ గౌడ్, జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు, సీపీవో శేషశ్రీ, పీడీ డీఆర్డీఏ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు, ఏడీ మైనింగ్ చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభులు, ఎంపీపీలు, ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వరికపూడిశెల నిర్మాణానికి ప్రాధాన్యం

నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో అనుసంధానం చేసి నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెదకూరపాడు మండలంలో గారపాడు చెరువు పూడ్చివేసి అక్రమించడంపై జిల్లా పంచాయతీ అధికారి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

- జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి మాట్లాడుతూ కౌలు రైతులందరికీ బ్యాంకులు ద్వారా రుణాలు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. నల్లబర్లి పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.
- పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించినట్లు చెప్పారు.
- మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా రైతులు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఏపీఎస్ఐడీసీ స్కీంలో పంటలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకాలు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను 4వ స్థాయీ సంఘ సభ్యునిగా ఎంపిక చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. స్థాయి సంఘాల్లో ఆమోదించిన పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

జెడ్పీటీసీలు ఏమన్నారంటే...

- పెదకూరపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కంకణాల స్వర్ణకుమారి మాట్లాడుతూ గారపాడులో రెండున్నర ఎకరాల చెరువును ఆక్రమించారని సభ దృష్టికి తెచ్చారు. దీనిపై స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా, గ్రామంలోని పెత్తందారులు ఇంటిపైకి దాడి చేసేందుకు వచ్చారని వాపోయారు. నాలుగు ఎకరాల చెరువును పూడ్చి అక్రమ కట్టడాలు కడుతుంటే, వర్షాలు కురిసినప్పుడు నీరు ఏ విధంగా ప్రవహిస్తుందని ప్రశ్నించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేరని ఆవేదన వ్యక్తం చేశారు.
- అమరావతి–సత్తెనపల్లి మార్గంలో జెడ్పీకి చెందిన రూ.కోట్ల విలువైన రెండెకరాల స్థలం ఆక్రమణలకు గురైందని సభ దృష్టికి తెచ్చారు, ప్రస్తుతం అది డంపింగ్ యార్డుగా వాడుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు.
- బొల్లాపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు రమావతు భీమిబాయి మాట్లాడుతూ వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేసి బొల్లాపల్లి ప్రజల దాహార్తి తీర్చాలని కోరారు. ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టుతో బొల్లాపల్లి మండలంలోని 20 గ్రామాల ప్రజలు నిరాశ్రయలుగా మారే పరిస్థితులు ఎదురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. వరికెపూడిశెల వచ్చిందని ఆనంద పడేలోపు బనకచర్ల రూపంలో నిర్వేదం ఎదురైందని తెలిపారు.
- గురజాల మెడికల్ కళాశాల ప్రగతిపై పలువురు జెడ్పీటీసీ సభ్యులు సంధించిన ప్రశ్నలపై వైద్యారోగ్యశాఖాధికారులు సమాధానాలు చెప్పలేకపోయారు. దీనిపై ఎంపీ లావు కృష్ణదేవరాయలు జోక్యం చేసుకున్నారు. మెడికల్ కళాశాల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులు, వాటితో చేపట్టిన పనుల ప్రగతిపై నివేదిక ఇవ్వాలని అధికారులను కోరారు.
- అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తున్నారంటూ రాజుపాలెం జెడ్పీటీసీ సభ్యురాలు సునీతారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు హసీం ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు సమాధానమిస్తూ కేంద్రం పీఎం కిసాన్ నిధులు విడుదల చేయగానే వాటితో కలిపి మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో రూ.20వేలు జమ చేస్తామని చెప్పారు.
- రొంపిచర్ల జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ సభ్యులకు తెలియకుండా అభివృద్ధి పనులకు అనుమతులు ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సభ్యుల ఆమోదం లేకుండా పనులకు అనుమతులు ఇచ్చేసి, తీరా అవి పూర్తయిన తరువాతా సభలో పెట్టి ఆమోదించమంటున్నారని.. ఇది న్యాయమేనా? అని ప్రశ్నించారు.

న్యూస్‌రీల్

అల్లూరి, పింగళి జీవితాలు స్ఫూర్తిదాయకం

నివాళులర్పించిన జేసీ, అధికారులు



నరసరావుపేట: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి, జాతీయ పతాక సృష్టికర్త పింగళి వెంకయ్య వర్ధంతిని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డీఆర్‌ఓ ఎ.మురళి, ఆర్డీఓ కె.మధులత, తహసీల్దార్ వేణుగోపాలరావు, అధికారులు పాల్గొన్నారు.

భూమి యజమాన్య పత్రాలు సిద్ధం



నరసరావుపేట: జిల్లాలో రీ–సర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు భూమి యాజమాన్య హక్కు పత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే శుక్రవారం పేర్కొన్నారు. యడ్లపాడు, చిలకలూరిపేట, నకరికల్లు, నాదెండ్ల, నరసరావుపేట, నూజెండ్ల, పెదకూరపాడు, రొంపిచర్ల, శావల్యాపురం గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. తొమ్మిది మండలాలకు 47,265 భూమి యాజమాన్య హక్కు పత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రశాంత వాతావరణంలో మొహరం జరుపుకోండి

జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: మొహరం వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. మొహరం పురస్కరించుకొని గ్రామాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్టు శుక్రవారం తెలిపారు. వేడుకలు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వేడుకల్లో అల్లర్లు, వివాదాలకు తావులేకుండా అందరూ సోదర భావంతో మెలగాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా చట్ట విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైళ్లలో తనిఖీలు



నరసరావుపేటటౌన్: మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా రైళ్లల్లో తనిఖీలు చేపట్టినట్లు పల్నాడు జిల్లా ఈగల్ సెల్ ఎస్ఐ జె.శామ్యూల్ రాజీవ్ తెలిపారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు భువనేశ్వర్ నుంచి నరసరావుపేట మీదుగా బెంగళూరు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైల్లో గురువారం అర్ధరాత్రి తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. నార్కోటిక్స్ పసిగట్టడంలో శిక్షణ పొందిన జాగిలంతో, స్థానిక పోలీసులతో పాటు జీఆర్పీ, ఆర్పీఫ్, ఈగల్ సెల్ పోలీసులు దాడులు చేశామన్నారు. అనుమానిత ప్రదేశాలు, అనుమానితుల లగేజ్‌లను క్షుణ్ణంగా తనిఖీలు చేశామన్నారు. దాడుల్లో ట్రాఫిక్ ఎస్ఐ వేణు, జీఆర్పీ ఎస్ఐ శ్రీనునాయక్, ఆర్పీఫ్ ఏఎస్ఐ సుభాని, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నృసింహుని హుండీ కానుకల లెక్కింపు

మంగళగిరి టౌన్: స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు శనివారం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఎగువ, దిగువ సన్నిధిలోను, శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడుల హుండీలను ఉదయం 9 గంటలకు లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల భక్తులు పాల్గొనవచ్చని ఆయన తెలియజేశారు.

కష్టాల్లో పింగళి వెంకయ్య కుటుంబీకులు

దయనీయ స్థితిలో ఆయన మనవరాలు భవాని



చీరాల: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య మనవరాలు భవాని దయనీయస్థితిలో ఉంది. అనారోగ్యానికి గురై కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇంటి నిర్మాణం జరిగినా అది శిథిలావస్థకు చేరింది. పింగళి వెంకయ్య వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం వేటపాలెం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దేవాంగపురిలోని ఆయన మనవరాలు భవాని గృహంలో జరగ్గా ఈ విషయాలు వెలుగు చూశాయి. వర్ధంతి కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు బట్ట మోహనరావు మాట్లాడుతూ త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య స్వాతంత్ర్య సమరయోధునిగా ఎన్నో సేవలు చేశారన్నారు. కృష్ణాజిల్లా దివి తాలూకా పెద్ద కల్లేపల్లి గ్రామంలో 1878లో ఆయన జన్మించారన్నారు. ఉన్నత చదువులు చదివిన ఆయన చరిత్ర అధ్యాపకుడిగా పనిచేశారని వివరించారు. ఆయన మనవరాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరం సీతారామయ్య, భవాని దంపతులను రోటరీ క్లబ్ తరపున సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఏవీ సురేష్‌బాబు, కార్యదర్శి అక్కల చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 522.50 అడుగుల వద్ద ఉంది. ఇది 153.8745 టీఎంసీలకు సమానం. సాగర్ నుంచి ఎడమ కాలువకు 2,114 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 54,542 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

సహకారం.. మంగళం!

సహకార ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే ..?

- ఎన్నికల నిర్వహిస్తామన్న హామీ నెరవేర్చని కూటమి
- వైఎస్ జగన్ హయాంలో మారిన సొసైటీల రూపురేఖలు



యడ్లపాడు పీఏసీఎస్ కార్యాలయం

యడ్లపాడు: సహకార సంఘాల ఎన్నికల విషయంలో కూటమి ప్రభుత్వం మరోమారు యూ టర్న్ తీసుకుంది. తాము అధికారంలోకి వస్తే సత్వరమే సహకార ఎన్నికలు నిర్వహిస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో రైతుల మద్దతుతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వెనువెంటనే సొసైటీలకు త్రిసభ్య కమిటీలుగా కొనసాగుతున్న వారిని వైదొలగాలని బలవంతపు రాజీనామాలు చేయించింది. సహకార సంఘాల్లో పనిచేసే అధికారులను అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జులుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. 2024 జూన్‌లో అధికార బాధ్యతలు చేపట్టి వసంత కాలం గడిచినా సహకార సంఘాల ఊసే ఎత్తలేదు. గతనెల 28తో అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జులు పరిమిత కాలం పూర్తి కావడంతో, మరో నెలరోజులు వారే కొనసాగేలా గడువు పెంచి మళ్లీ ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు త్రీమెన్ లేదా ఫైవ్‌మెన్ కమిటీలను ఏర్పాటు చేయాలని సన్నాహాలు చేస్తోంది.

వైఎస్సార్ సీపీ హయాంలో ఘనం

జిల్లాలో 60 సొసైటీలు ఉండగా వాటిలో 2.40 లక్షల మంది సభ్యులు ఉన్నారు. 2014–15 నుంచి 2018–19 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రభుత్వం పట్టించుకోక నష్టాల్లో ఉన్న సహకార సంఘాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ సర్కారు విశేష కృషి చేసింది. రుణాలు ఇవ్వడం, రికవరీ చేయడం వరకే పరిమితమైన సంఘాల్ని సమూలంగా మార్చేసింది. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంఘాలను లాభాల బాట పట్టించారు.

- సంఘాల్లో రైల్వే టికెట్ల నుంచి దైవ దర్శనం టికెట్ల వరకూ, విద్యుత్ బిల్లుల చెల్లింపులు వంటి అనేక సేవలు రైతులకు అందుబాటులోకి వచ్చాయి.
- పెట్రోల్ బంకులు, మల్టీ పర్పస్ గోదాములు, కోల్డ్ స్టోరేజీలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలతో నమ్మకమైన వ్యాపారాలకు శ్రీకారంచుట్టి కొత్త ఒరవడి తెచ్చారు.
- రైతులు పండించిన ఉత్పత్తుల్ని స్థానికంగానే నిల్వ చేసుకునేలా జిల్లాలో 53 మల్టీ పర్పస్ గోడౌన్లు, 3 కోల్డ్ స్టోరేజీలు, 3 పెట్రోల్ బంకులను ఏర్పాటు చేశారు.
- జిల్లాలోని శావల్యాపురంలో నిర్మించిన కోల్డ్‌స్టోరేజ్ రాష్ట్రంలోనే సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటైన మొట్టమొదటిది కావడం విశేషం.
- పల్లె ప్రజలకు తక్కువ ధరకే జనరిక్ మందులు లభించేలా ఐదు ప్రధానమంత్రి జనఔషధి కేంద్రాలు నెలకొల్పారు.
- 60 సొసైటీలను కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చి, యూనివర్సల్ టెక్నాలజీ ప్లాట్‌ఫామ్ ద్వారా అన్నిరకాల ఈ–సేవలను గ్రామస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటిద్వారా సామాన్య పౌరులతో పాటు రైతులకు 300లకు పైగా వివిధ రకాల పౌరసేవలు అందించారు. మెరుగైన భవిష్యత్తు నిర్మాణానికి సహకార సంఘాలు పునాది వంటివని నిరూపించారు.



సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన మల్టీపర్పస్ గోదాము

రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన బాబు

- ఏడాదిలో రూ.లక్షా అరవై వేల కోట్లు అప్పు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే..
- అధిక విద్యుత్ ఛార్జీలతో ప్రజల నడ్డి విరగ్గొడుతున్నారు
- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పిడుగురాళ్ల: రాష్ట్రంలో ఒక్క ఏడాదిలోనే రూ.లక్షా అరవై వేల కోట్ల అప్పు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని అందుకే ఈ ప్రభుత్వానికి, చంద్రబాబుకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతున్నామని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తాను రిలీజ్ చేసిన వీడియో సందేశంలో కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ... మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల్లో రూ.3,30,000 కోట్లు అప్పు చేసి రాష్ట్ర ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి కల్పించారన్నారు. అలాగే కరోనా సమయంలో రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి, ప్రజలు ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకున్నారన్నారు. ఐదేళ్లల్లో రాష్ట్రానికి ఇంత చేసి సగటున ఏడాదికి రూ. 65 వేల కోట్లు మాత్రమే అప్పు చేసి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారన్నారు.

- చంద్రబాబునాయుడు ప్రజలకు సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండానే ఒక్క ఏడాదిలోనే రూ.లక్ష అరవై వేల కోట్లు అప్పు చేశారని మండి పడ్డారు. వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్రం శ్రీలంక అవుతుందంటూ గగ్గోలు పెట్టిన టీడీపీ అనుకూల చానళ్లు ఇప్పుడు ఏమయ్యాయని ప్రశ్నించారు. విపరీత అప్పులతో నేటి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆఫ్రికా లోని సూడాన్ కంటే దారుణంగా ఉందన్నారు.
- ఎన్నికలకు ముందు విద్యుత్ బిల్లులు ఒక్క రూపాయి కూడా పెంచనని బీరాలు పలికిన చంద్రబాబు నేడు స్మార్ట్ మీటర్లతో రూ.వందలు వచ్చే కరెంట్ బిల్లులను రూ.వేలకు మార్చారన్నారు. దీంతో వ్యాపారులు, సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన మొదటి, రెండవ నెలలో తమ ఇంటి కరెంట్ బిల్లు రూ. 6349లు వస్తే, కూటమి ప్రభుత్వంలో నేడు రూ.16,918లు కరెంట్ బిల్లు వచ్చిందన్నారు. సంస్కరణలు అంటే ఇదేనా చంద్రబాబు అని ప్రశ్నించారు.

వర్షా కాలం.. జరభద్రం

- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన



సత్తెనపల్లి 6వ వార్డులోని కాలువ దుస్థితి

సత్తెనపల్లి: జిల్లాలో వర్షాకాలం కారణంగా మారిన వాతావరణం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వర్షాలతో నెలకొన్న చల్లని వాతావరణానికి దగ్గు, కఫం, జలుబు చేసే అవకాశం ఉందని, వీటికి తోడు మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా, చికున్ గున్యా వంటి జ్వరాలు ప్రబలుతాయంటున్నారు. చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యం కాపాడుకోవచ్చని చెబుతున్నారు. ఇప్పుడు ఏ ఇంట్లో చూసినా ఏదో ఒక అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వారే ఉన్నారు. ఆరోగ్య జాగ్రత్తలు పాటించకపోవడం, పౌష్టికాహార లోపం, పారిశుద్ధ్య లోపం, తదితర కారణాలతో పాటు ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితులతో జనం అస్వస్థతకు గురవుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు జిల్లాలో 15 డెంగీ కేసులు నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,200 గరిష్ఠం : రూ. 2,000

మోడల్ ధర రూ. 1,700

మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	27,878
అమ్మకాలు	31,653
నిల్వ	3,750

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 13,000
నంబరు–5	రూ. 10,000 – 13,200
273	రూ.10,000 – 13,500
341	రూ. 10,000 – 12,200
సూపర్ –10	రూ. 9,800 – 12,500

నాన్ ఏసీ ప్రత్యేక రకం క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 13,800
బాడిగ – 355	రూ. 10,000 – 12,600
దేవనూరు డీలక్స్	రూ. 10,000 – 12,400
ఆర్మూర్	రూ. 9,600 – 11,200
తాలుకాయలు	రూ. 5,000 – 6,800

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 13,000
నంబరు–5	రూ. 10,000 – 13,300
341	రూ. 10,000 – 13,400
4884	రూ. 10,000 – 12,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 13,500
బాడిగ – 355	రూ. 10,000 – 12,600
దేవనూరు డీలక్స్	రూ. 10,000 – 12,500
తాలుకాయలు	రూ. 5,500 – 7,000

–కొరిటిపాడు (గుంటూరు)



పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 438

కొమ్ములు : 198 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,000	10,250	10,200

కాయలు : 240 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,000	10,250	10,200

మొత్తం అమ్మకాలు : 328.500 క్వింటాళ్లు

–దుగ్గిరాల

అన్నపూర్ణాదేవికి ఆషాఢం సారె



అమ్మవారికి సారె తీసుకెళుతున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణాదేవి అమ్మవారు

పెదకూరపాడు: మండలంలోని 75త్యాళ్లూరులో వేంచేసియున్న శ్రీకాశీ అన్నపూర్ణదేవికి శుక్రవారం మహిళలు ఆషాఢం సారె సమర్పణ ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీవిశ్వేశ్వర స్వామీ ఆలయం నుంచి మేళతాళాలతో గ్రామ దేవుని వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని 108 రకాల వంటకాలు, వస్త్రాలు, పసుపు కుంకుమ గాజులు, పూలు, పండ్లు, తాంబూలాలు, వాయనాలను అన్నపూర్ణాదేవికి సమర్పించారు. ఆలయ అర్చకులు నుదురుపాటి హనుమంతరావుశర్మ, హరినాథ్ శర్మ, తారకనాథ్ శర్మ పూజ క్రతువు నిర్వహించారు. శ్రీ శివసాయి ట్రస్టు సభ్యులు పర్యవేక్షణలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రతి ఏటా ఆషాఢమాసంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం అమ్మవారికి సారె సమర్పణ నిర్వహించడం జరుగుతుందని మహిళలు తెలిపారు.

ఆడపిల్లల ఆస్తిహక్కు కోసం పోరాడిన సూర్యావతి

ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని



మాట్లాడుతున్న గుంటుపల్లి రజిని

సత్తెనపల్లి: ఆడపిల్లలకు ఆస్తి హక్కు కోసం, మద్యపానం నిషేధం కోసం సూర్యావతి పోరాడారని ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని అన్నారు. ఐద్వా నాయకురాలు స్వర్గీయ మానుకొండ సూర్యావతి వర్ధంతి కార్యక్రమం పట్టణంలో శుక్రవారం నిర్వహించారు. వర్ధంతి సభకు ఐద్వా పట్టణ అధ్యక్షురాలు మునగా జ్యోతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు గద్దె ఉమశ్రీ మాట్లాడుతూ మండల అధ్యక్షురాలిగా, శాసనమండలి సభ్యురాలిగా సూర్యావతి పని చేశారన్నారు. ఇంటింటికి మరుగుదొడ్లు, సంపూర్ణ మద్యపాన నిషేధం, ఆడ పిల్లల ఆర్థిక స్వాతంత్ర్యం కోసం సూర్యావతి పోరాడారని వివరించారు. మద్యం వలన మహిళలపై నిత్యం లైంగికదాడులు, దాడులు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వాలు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ దుకాణాల ద్వారా కేరళ తరహాలో 16 రకాల సరుకులు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సూర్యావతి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐద్వా జనరల్ బాడీ సమావేశం నిర్వహించి నూతన వార్డు కమిటీని ఎన్నుకున్నారు. ఐద్వా నాయకురాలు ధరణికోట విమల, సుధారాణి, లక్ష్మి, అనురాధ, అనంతలక్ష్మి మల్లేశ్వరి, జ్యోతి, భవాని, ఉమామహేశ్వరి భారతి , కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పెండాల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పీపీపీ విధానంలో మెడికల్ కళాశాల నిర్మాణం వద్దు

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జనరల్ సెక్రటరీ రవికుమార్



మాట్లాడుతున్న రవికుమార్

బాపట్ల: రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ మాచవరపు రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విద్యార్థి విభాగం సమావేశం నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ ఈ మేరకు ఈనెల 7వ తేదీన విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్లకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రైవేటు భాగస్వామ్యంతో కళాశాలలు నిర్మాణం జరిగితే పేదవానికి వైద్యం సకాలంలో అందే పరిస్థితి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడికి కార్పొరేట్ విద్య అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సమావేశంలో బాపట్ల జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు యల్లావుల సోహిత్ యాదవ్, పర్చూరు నియోజకవర్గ అధ్యక్షులు కాటి లక్ష్మణ్, రాష్ట్ర విద్యార్థి విభాగం కమిటీ జాయింట్ సెక్రటరీ షేక్ పర్వే జ్, రేపల్లె అధ్యక్షులు వసీం మొహమ్మద్, చీరాల అధ్యక్షులు గోనబోయిన వెంకటేష్, జిల్లా విద్యార్థి యువ నాయకులు చోప్రా రాజశేఖర్ ఉన్నారు.

జీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ నల్లపాటి చంద్రశేఖరరావు మృతి



నల్లపాటి శివరామచంద్రశేఖరరావు (ఫైల్)

నరసరావుపేట: గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (జీడీసీసీ) మాజీ చైర్మన్ నల్లపాటి శివరామ చంద్రశేఖరరావు (84) మృతిచెందారు. గత 20రోజులుగా ఆయన హైదరాబాదులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామం జొన్నలగడ్డకు తీసుకొచ్చారు. ఆయన భార్య రెండేళ్ల క్రితం చనిపోయారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో నల్లపాటి రామచంద్రప్రసాదు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. గురజాల మాజీ శాసనసభ్యులు కాసు మహేష్‌రెడ్డి, ప్రస్తుత జీడీసీసీ బ్యాంకు అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో పాటు పలువురు రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు చంద్రశేఖరరావు మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. చంద్రశేఖరరావు మృతికి మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులను భర్తీ చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నయాంభాను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్కృతం–1, హిస్టరీ–1, కామర్స్–2, కంప్యూటర్ సైన్స్–2, కెమిస్ట్రీ–1, జువాలజీ–1, అతిథి అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. సంబంధిత పోస్టు కోసం పోస్ట్ గ్రాడ్యూయేషన్‌లో 55 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని, పీహెచ్‌డీ, యుజీసీ నెట్, సెట్ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన చేయగలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 11వ తేదీ ఉదయం 11గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 8688169290 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఫ్లోరోసిస్‌పై అప్రమత్తంగా ఉండండి

జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి డాక్టర్ గిరిధర్



శిక్షణ ఇస్తున్న జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి డాక్టర్ గిరిధర్

పెదకూరపాడు: ఫ్లోరోసిస్‌పై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి డాక్టర్ గిరిధర్ అన్నారు. పెదకూరపాడు మండలం 75 తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ పై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరిధర్ మాట్లాడుతూ ఫ్లోరోసిస్ ఏ విధంగా వ్యాపిస్తుందో, దానిని ఏవిధంగా నివారించగలరో వివరించారు. బోర్‌వెల్ తాగు నీటిద్వారా, పొగాకు సంబంధింత వస్తువుల ద్వారా, పానీపూరి, కుర్ కురే వంటి వాటిని తినడం వల్ల అందులో కలిపే బ్లాక్ సాల్ట్ వల్ల, బ్లాక్ టీ వంటివి మితిమీరి ఉపయోగిస్తే ప్రజలు త్వరగా ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడతారని వివరించారు. పాఠశాలలో చదువుతున్న, 3,4,5వ తరగతి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెలుగొండా రెడ్డి, ఎంపీహెచ్ఈఓ లక్ష్మీ మనోహర్, ఎంపీహెచ్ఎస్ దిలీప్ కుమార్, బి.శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ కుట్రలో భాగంగానే శిలాఫలకం ధ్వంసం



పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

- బాధ్యులపై సత్వరం చర్యలు తీసుకోవాలి
- పిడుగురాళ్ల పీఎస్‌లో వైఎస్సార్ సీపీ నాయకుల ఫిర్యాదు

పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ఏర్పాటు చేసిన రైల్వే ఓవర్ బ్రిడ్జి శంకుస్థాపన శిలాఫలకాన్ని ధ్వంసం చేయటం రాజకీయ కుట్రలో భాగమేనని వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు మాదాల కిరణ్‌కుమార్, చింతా సుబ్బారెడ్డిలు అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం శిలాఫలకం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పట్టణంలోని జానపాడు రోడ్డులో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.52 కోట్ల నిధులు మంజూరు చేయించి, రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా అప్పటి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి శిలాఫలకాన్ని ఆవిష్కరించారన్నారు. అయితే రాజకీయ కుట్రలో భాగంగా శిలాఫలకాన్ని ధ్వంసం చేయటం సరైన పద్ధతి కాదన్నారు. ఒక వేళ నిర్మాణానికి అడ్డు వస్తే తొలగించి, ఆ పరిసర ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేయాలేగానీ, ధ్వంసం చేయటం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి చింతా రామారావు, మున్సిపల్ కౌన్సిలర్లు కొక్కెర శ్రీను, షేక్ సైదావలి, కత్తెరపు వాసుదేవరెడ్డి, నాయకులు కందులూరి శివయ్య, చల్లా పిచ్చిరెడ్డి, శివారెడ్డి, అల్లు పిచ్చిరెడ్డి, శెట్టుపల్లి పూర్ణ, కాలే మాణిక్యరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మనవరాలిని చంపిన తాత అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీఎస్పీ మురళీకృష్ణ

తాడేపల్లి రూరల్ : మండలంలోని కుంచనపల్లి వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై ఉన్న బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి పైనుంచి మనవరాలిని నీళ్లలోకి విసిరేసి, మృతికి కారణమైన తాతయ్యను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ సందర్భంగా నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో ఓ వృద్ధుడు బాలికను తీసుకువచ్చి బలవంతంగా కాలువలోకి విసిరివేశాడని తెలిపారు. 100కు సమాచారం రావడంతో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంతో కాలువలో గాలించి, బాలిక మృతదేహాన్ని గుర్తించినట్లు చెప్పారు. బాలికను తాడికొండ మండలం బడేపురానికి చెందిన కూరపాటి హేమగా గుర్తించామని చెప్పారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి బాలిక తాతయ్యను తాడికొండ అడ్డరోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నామని వివరించారు. పుట్టుకతోనే మానసిక వికలాంగురాలైన హేమ తల్లి, తండ్రి చనిపోయారన్నారు. తాతయ్య మాధవరావు, నాయనమ్మ సుమతి పెంచుతున్నట్లు చెప్పారు. నాయనమ్మ కూడా అనారోగ్యం పాలు కావడంతో ఈ మధ్య గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారన్నారు. హేమకు కూడా అక్కడే వైద్యం చేయిస్తున్నారు. వైద్యులు అనారోగ్యం కుదుటపడదని చెప్పడంతో తాతయ్య, నాయనమ్మ ఆందోళన చెందారు. ఇద్దరికీ మందులు ఖర్చులకు డబ్బులు లేకపోవడం, తాము లేకపోతే మనవరాలు ఏమవుతుందనే ఆందోళనతో కాలువలోకి పడవేసి హత్య చేశాడని వివరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి మాధవరావును అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరిచామని డీఎస్పీ తెలిపారు. కేసును 24 గంటల్లో ఛేదించిన సిబ్బందికి ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



అనగాని శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రేపల్లె: మున్సిపల్ ఇంజినీరింగ్ ఒప్పంద కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పడమటి బిక్షాలు కోరారు. టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు, పార్క్ కూలీలకు, ఆఫీసు సిబ్బందికి, టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి కేటగిరిల వారీగా జీఓ 36 ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. అవుట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని విన్నవించారు. రిటైర్ అయిన కార్మికులస్థానంలో, మృతి చెందిన వారి స్థానాలలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. సమస్యను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని శివప్రసాద్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగం వాణిశ్రీ పాల్గొన్నారు.

ఛిద్రమవుతున్న రోడ్లు

- గ్రానైట్ లారీ ఎదురైతే బెంబేలెత్తున్న ప్రయాణికులు
- భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు ధ్వంసం
- ప్రతిపాదనలతో సరి.. గోతులతో సాగని ప్రయాణం
- పట్టించుకోని అధికారులు, పాలకులు



గోతుల మయంగా కొణిదెన–ఉప్పుమాగులూరు లింకు రోడ్డు



కొణిదెన రోడ్డులో లారీ నుంచి దొర్లిపడిన గ్రానైట్ రాయి (ఫైల్)

బల్లికురవ: గ్రామీణ రహదార్లు గ్రానైట్ భారీ వాహనాల రాకపోకలతో ఛిద్రమౌతున్నాయి. అడుగుకో గోయ్యితో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోంది. బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ నుంచి తీసే స్టీల్‌గ్రే మీటరు, ముడిరాళ్ల మార్టూరు, గణపవరం, జొన్నతాళి, వేమవరం, మే దరమెట్ల, సంతమాగులూరు, ఒంగోలు, మురికి పూడి, తాతపూడిలోని పరిశ్రమలతోపాటు బెంగళూరు, తాడిపత్రి, చెన్నై, హైదరాబాద్ పట్టణాలకు నిత్యం ఎగుమతులు జరుగుతుంటాయి. ఒక్కో లారీపై ప్రమాదకరంగా 4 నుంచి 7 బ్లాక్‌లను ఎక్కిస్తూ 70 నుంచి 90 టన్నుల వరకు తరలిస్తున్నారు. గోతుల కారణంగా అంటూ ఎక్కడ రాయి దొర్లి కింద పడుతుందోనని ప్రజలు వాహనదారులు భయాందోళన చెందుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం..

భారీ వాహనాల రాకపోకలతో బల్లికురవ–నాగరాజుపల్లి–మార్టూరు, చెన్నుపల్లి–వేమవరం జంక్షన్–తాతపూడి –అనంతవరం, కొణిదెన–వేమవరం జంక్షన్–ఉప్పుమాగులూరు, నక్కబొక్కలపాడు–కొదదెన–మార్టూరు, బల్లికురవ–సంతమాగులూరులో రోడ్లు మోకాటిలోతు గోతులతో 10 కిలో మీటర్లు ప్రయాణానికి సైతం 40 నుంచి 50 నిమిషాల సమయం పడుతోంది. గోతుల్లో గ్రానైట్ లారీలు కూరుకుని ట్రాఫిక్‌జామ్‌లతో బస్సులు, ఆటోల్లో ప్రయాణించే ప్రయాణికులకు గమ్యం చేరతామన్న గ్యారంటీ లేదు.

గ్రానైట్ దారుల ఆధీనంలో..

చెన్నుపల్లి–అనంతవరం రోడ్లులో కొండాయపాలెం గ్రామాల మధ్య క్వారీ నిర్వాహకులు ఆర్‌అండ్‌బీ రోడ్డును తమ ఆధీనంలోకి తీసుకున్నారు. రహదారిపైనే యంత్రాలు, లారీలు నిలపడం, లోడింగ్ చేపట్టడం వల్ల తారురోడ్లు సైతం జారుడు బల్లను తలపిస్తున్నాయి. వర్షాకాలంలో ఈరోడ్డులో ప్రయాణించాలంటే సాహసం చేయక తప్పదు. దెబ్బతిన్న రోడ్లకు ప్రతిపాదనలు తయారు చేసి పంపుతున్నారు. నిధులు మంజూరుతో టెండర్‌కు కాంట్రాక్టర్లను ఆహ్వానించినా భారీ వాహనాల రాకపోకలకు మెయింటెనెన్స్ ఇవ్వలేక రోడ్ల అభివృద్ధికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

గ్రానైట్ లారీ ఎదురైతే హడలే..



బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు, అద్దంకి మండలాల్లో రహదార్లపై టూవీలర్, కార్లపై ప్రయాణించాలంటే భయంగా ఉంది. 4 నుంచి 7 గ్రానైట్ బండలు, లారీ ట్రాలీలపై ఎగుమతితో ఎక్కడ ఒరుగుతాయోనని భయపడుతున్నాం.

– ధర్మవరపు రవికుమార్, వాహన చోదకుడు

ఆదాయం సమకూరుతున్నా అభివృద్ధి లేదు..



బల్లికురవ, ఈర్లకొండ చుట్టూ 25 పైచిలుకు గ్రానైట్ క్వారీలు మండలంలో 600 పైచిలుకు పరిశ్రమలు ఉన్నాయి. ఎగుమతులకు రాయల్టీ చెల్లింపు ద్వారా ఆదాయం సమకూరుతున్నా రహదారులు అభివృద్ధి చెందడం లేదు. ఇక్కడ నుంచి ప్రభుత్వానికి చెల్లించే ఆదాయంతో పూర్తిస్థాయిలో అన్ని రహదార్లను అభివృద్ధి పరచవచ్చు.

– తంగిరాల వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకుడు